
# అతి

కె.వి.ఎస్.వర్మ




గోదావరి ఎక్స్‌ప్రెస్, రోడ్ కమ్ రైలు బ్రిడ్జి మీంచి అప్పుడే కొవ్వూరు వెళ్ళింది.

అయినా చప్పుళ్ళు వస్తూనే వున్నాయి. అలాగని మరో రైలేదీ రాలేదు.

గోదావరిగట్టు గచ్చు చప్టామీద వేరుసెనగకాయలు కొట్టుకుంటూ మిత్రులంతా యుద్ధప్రాతిపదికమీద తింటున్నారు. వాళ్ళంతా ఆరుగంటలకే అక్కడికొచ్చి ముంగిలా కూర్చుని కూర్చుని ఓ అయిదు నిమిషాలక్రితమే వేరుసెనగకాయల కుర్రాడొస్తే మొత్తం జంగిడి కొనేశారు.

ఓ పది నిమిషాలకు ఆతిండి కార్యక్రమం పూర్తయింది.

ఒకరినొకరు చూసుకుని మళ్ళీ తలలు తిప్పి గోదావరి వంక చూశారు.

"బెల్లం ముక్క వుంటే బావుండేది. వేరు సెనగకాయలు చాలా తినేశాం. పైత్యం చేస్తుంది."

" ఏం సుకుమారమండీ కవికుమారా"

"కథ్రాజా వారు ప్రతిదానికీ అడ్డం రావడం బాగోలేదు"

"ఏది బాగుందిలెండి! మొన్నటిదాకా బారుల్లో మందు లాగిస్తూ వేరుసెనగ మిక్చర్ తెగతిన్నప్పుడు తమరు బెల్లం ముక్కలు బొక్కిన జ్ఞావకం నాకు లేదండి"

"మందే దానికి విరుగుడని మీకు తెలియక పోవడంలో ఆశ్చర్యం లేదులెండి. తమరు కథ్రాజా వారు కదా"

"మీరిద్దరూ వాదన మాని ఇంకేదన్నా మాట్లాడండి" అన్నాడు శాస్త్రి.

"మౌనంగా వుండటం కంటే ఎవరో ఒకరు వాదించినా కాలక్షేపమే".

"బఠానీల కుర్రాడొస్తే బావుణ్ను"

"నీది కడుపా, కంబాళ చెరువా? ఇప్పుడే కదా వేరుసెనగకాయలు అన్ని తిన్నావ్"

"మందుతో నువ్వు ఎంతెంత తినేవాడివో నాకు తెలీదా"

"ఆ రోజులు ఎందుకు గుర్తు చేస్తావ్ నాయుడూ"

"నేనేమన్నా కావాలని గుర్తు చేశానా"

"హసనానికి రాణివి నీవై, వ్యసనానికి బానిస నేనై" అంటూ పాడాడు కొటేషన్ రావు.

"బావుంది. నా అనుభవం ఒకటి చెబుతాను"

"చెప్పండి శ్రీపాదసారూ"

"ఆయనెవరు"

"రాజమండ్రిలో ఉంటూ కూడా నువ్వలా అడగడం సాహిత్య ద్రోహం"

"అన్నీ అందరికీ తెలుస్తాయా"

"అలాగని ఏంలేదు వాసూ. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అనుభవాలూ-జ్ఞాపకాలూనూ అని తన జీవిత చరిత్ర రాశారులే. అందుకని జగదీష్ అలా అన్నారు"

కవి కుమారుడు చిన్నగా నకిలించి, ఛార్మినార్ సిగరెట్ అంటించాడు. గోదావరి గలగలా ప్రవహిస్తోంది.

అందరి వంకా ఓసారి చూసి, కళ్ళు మూసుకుని, తెరిచి, మరో దమ్ములాగి కవి కుమారుడు గొంతు సవరించుకున్నాడు.

"నాలుగైదు గంటల వ్యవధిలో మీరెవ్వుడన్నా రెండు బార్లకెళ్లారా. వెళ్ళుండరు. నేనెళ్లాను. హిట్లర్ కూడా వెళ్లాడు. అంటే ఆ రోజున నాతో వచ్చాడన్న మాట. నేనంతా నిజమే చెబుతున్నాను. అబద్ధం చెప్పడం లేదు. జర్నలిస్టు అజయ్‌లేడూ, అతను రెండు పెగ్గులు దాటేడంటే, నాకు హిట్లర్ అంటే చాలా ఇష్టం. రక్తం రక్తం. యుద్ధం యుద్ధం. ఈ ప్రపంచాన్ని సర్వనాశనం చేసేయ్యాలి" అంటూ మాట్లాడతాడు. ఆ హిట్లర్ అన్న మాట. ఆ రోజే జీతాలొచ్చాయి. హారతి బార్‌కెళ్లాం. ముందు చెరో క్వార్టరూ తాగేశాం. వన్‌మోర్ లార్జ్ అన్నాడు హిట్లర్. నేనేనా తక్కువ తిన్నది? టూ మోర్ అన్నాను"

"హిట్లర్. పవర్. అవును సార్ పవర్. ఈ పాడు ప్రపంచాన్ని నాశనం చేసేయ్యాలి. మీ కవులు చెబుతారు చూడండి. అలాంటి సుందర ప్రపంచం సృష్టించాలి. రక్తం వరదై పారాలి. ఏవంటార్ సార్" అన్నాడు అజయ్.

ఏవంటాను?

బేరర్‌కి బిల్లు చెల్లించి బయటపడ్డాం.

"సార్ నన్నింటి దగ్గర దింపెయ్యరా, ప్లీజ్" అన్నాడు.

సరేనన్నాను. కొంత దూరం వచ్చాం.

"ఒక్కసారి ఆపండి సార్" అన్నాడు.

స్కూటరాపాను.

"రండిసార్" అన్నాడు.

స్కూటర్ స్టాండ్ వేసి కర్పూరం బార్‌లోకి హిట్లర్ వెంట వెళ్లాను.

"ఒక్క పెగ్ సార్. వెళ్లిపోదాం" అంటూ కూర్చున్నాడు.

నేనూ కూర్చున్నాను.

చెరో పెగ్గూ తాగాం.

మళ్ళీ మరో పెగ్‌కు ఆర్డరిస్తూ, "ఇవాళ దీని అంతు చూద్దాం సార్. ఓ.కే. సార్?" అన్నాడు.

"ఓయస్ ఆల్‌రైట్" అన్నాను.

ఆ బార్ అతను హిట్లర్‌కు తెలిసిన వాడు కావడంతో పన్నెండు గంటల దాకా తాగేశాం. తర్వాత, అతన్ని ఇంటి దగ్గర దింపేసి మా ఇంటికి బయల్దేరాను. గాలిలో తేలుతున్నట్టు అంటారు చూడు అలాగుంది నా పని. దారిలో ఓ పక్క రోడ్డులో కిళ్లీ షాపులా కనిపించింది. సిగరెట్లయిపోయిన సంగతి గుర్తొచ్చింది.

సడన్‌గా స్కూటరాపి, స్టాండ్ వేశాను. పక్క వీధిలోకి వెళ్లాను. కిళ్లీ కొట్టతను షాపు మూసెయ్యబోతుంటే గబగబా వెళ్లి సిగరెట్లు కొన్నాను. కిళ్లీ కట్టమన్నాను. సిగరెట్ వెలిగించి గుండెలోకి పొగలాగి కళ్లు మూసుకున్నాను. భూమి గుండ్రంగా తిరుగుతోంది. 'కిళ్లీసార్' అంటే, అది తీసుకుని బుగ్గన పెట్టుకున్నాను. కిళ్లీకొట్టు పక్కన బెంచీలాంటిదుంటే దానిమీద కూర్చున్నాను. కాసేపటికి వేళ్లు చుర్రుమంటే ఉలిక్కిపడి సిగరెట్ ముక్క తీసి పారేశాను. నెమ్మదిగా వెనక్కి వెళ్లాను. స్కూటర్ లేదు. అసలే చలికాలం ఏమో, మరింత చలేసింది. స్కూటర్ పెట్టి అయిదు, పది నిముషాలకంటే కాలేదు. ఆ కాస్త టైంలో ఎవరు పట్టుకుపోయారు?

తీవ్రంగా ఆలోచించాను.

అంత తక్కువ వ్యవధిలో స్కూటర్‌ను మాయం చెయ్యడం ఇంపాజిబుల్ అనుకున్నాను.

చలి కొరికేస్తోంది.

మరో సిగరెట్ వెలిగించి దమ్ము గట్టిగా లాగి ఉఫ్ మని వదులుతూ ఇంకా తీవ్రంగా ఆలోచించాను.

'యస్ యస్ అంతే' అనుకున్నాను. స్కూటర్‌ను ఆ వీధిలో పెట్టి వుంటాననుకున్నాను. ఎలాగయినా స్కూటర్‌ను వెతకాలనుకున్నాను. చివరి వరకూ వెళ్లాను. ఛ. ఈ వీధి కాదనుకుని మరో వీధికెళ్లాను. ఛఛ ఆ వీధి కాదనుకుని ఇంకో వీధికెళ్లాను. తెల్లవారుజాము వరకూ అలా తిరుగుతూనే వున్నాను. మందు ప్రభావం కూడా అప్పటికి తగ్గిందేమో, కాళ్ల నొప్పులు తెలిసొచ్చాయి.

ఇక లాభం లేదనుకుని రిక్షా ఎక్కి హిట్లర్ ఇంటికెళ్లాను. అతణ్ని లేపి విషయం చెప్పాను.

"ఎక్కడ పెట్టారు సార్" అన్నాడు.

"అక్కడ పెట్టాననిపిస్తోంది" అని నసిగాను.

"మీరింటికెళ్లి పడుకోండి రేపు చూద్దాం" అన్నాడు.

మర్నాడు మధ్యాహ్నం దాకా వెదికాం. కనిపించలేదు.

దాంతో పోలీస్ కంప్లయింట్ ఇచ్చాం. స్కూటర్ నెంబరూ, రంగూ వగైరా తెలుసుకుని సి.ఐ. అన్ని పోలీస్ స్టేషన్లకూ ఫోన్ చేసి,

"డోంట్ వర్రీ. మీ స్కూటర్ తప్పక దొరుకుతుంది" అన్నాడు.

"మనకీ సి.ఐ బాగా తెలుసు. ఆయనంత గట్టిగా చెప్పారంటే, తప్పక దొరుకుతుంది" అన్నాడు హిట్లర్.

కవికుమారుడు చెప్పడం ఆపి, సిగరెట్ వెలిగించాడు.

"ఇంతకీ స్కూటర్ దొరికిందా? ఇంతే సంగతులా" వాసు అడిగాడు.

"దొరికింది"

"ఎక్కడ"

"ఖమ్మం దగ్గర"

"ఏవిటీ, ఖమ్మమా?"

"అని పోలీసులు చెప్పారు"

"అంటే"

"ఖమ్మం నుంచి నిన్ననే వన్‌టౌన్ స్టేషన్‌కి తెచ్చారుట.

స్టేషన్‌కు వెళ్లి తీసుకోమంటే అక్కడికెళ్లాను. అప్పటికి సూపులైట్ వెలిగింది. నేనా రోజున నా స్కూటర్ని ఆ పోలీస్ స్టేషన్ ముందే పెట్టానన్నమాట"

"అసలే తాగున్నాడు. పైగా మా స్టేషన్ ముందే పార్క్ చేస్తాడా? అని తమరి తిక్క కుదర్చడానికి పోలీసులే స్కూటర్ని స్టేషన్‌లో పెట్టేశారన్నమాట" అన్నాడు కథ్రాజు పకపకా నవ్వుతూ.

"అన్నమాటేంటి ఉన్నమాటే అన్నాడు కవి కుమారుడు నవ్వేస్తూ.

"మంచి అనుభవమే. అది జరిగేక తాగుడు మానేయాలనిపించలేదా".

"స్కూటర్ పోయిందనే బెంగతో కొన్నాళ్లూ, దొరికిందనే సంతోషంతో ఆ తర్వాతా మందు సేవిస్తూ వచ్చాను" అన్నాడు ఆవలిస్తూ కవి కుమారుడు.

అంతలో గౌతమీ ఎక్స్‌ప్రెస్ రోడ్ కమ్ రైలు బ్రిడ్జి మీదకొచ్చింది.

అంతా లేచి ఇళ్లకు బయల్దేరారు.

కొటేషన్‌రావు నవ్వుతూ అన్నాడు.

"అలవాటు ముందు చేదు అనుభవాలు కూడా బలాదూర్"

**(వచ్చేవారం 'భేదం')**